సభ.. రభస..!

గ్రామసభల్లో అధికారులపై జానాగ్రహం

పథకాలకు అనర్హులను ఎంపిక చేశారని వాగ్వాదం

జిల్లా అంతటా రసాభాసగా గ్రామసభలు

''జాబితాలో మా పేర్లు ఎందుకు లేవు..? అర్హులను వదిలేసి, అనర్హులను ఎలా ఎంపిక చేశారు..? ఇళ్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఎలా మంజూరు చేస్తారు..? ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు కూడా మాకు అర్హత లేదా..?''

నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన రెండో రోజు బుధవారం దాదాపు అన్ని గ్రామ సభల్లో కనిపించిన దృశ్యాలివి. ప్రతీచోట ఇలా నిలదీతలు, ఆగ్రహావేశాలు, గందరగోళంతో సభలన్నీ రభస..రభసగా సాగాయి. గ్రామస్తులు రాస్తారోకో చేశారు. ప్రశ్నిస్తున్న ప్రజలను బెదిరించేందుకు, నోళ్లు మూయించేందుకు, వినకపోతే బయటకు గెంటేసేందుకు పోలీసులు యత్నించారు. ఈ పరిస్థితుల్లో సభను నిర్వహించలేక.. అధికారులు మధ్యలోనే వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా పలు కొన్ని చోట్ల అధికారులకు ప్రజలకు వాగ్వాదాలు జరిగాయి.

– నెట్‌వర్క్

చండ్రుగొండ: తుంగారం గ్రామసభలో గ్రామస్తులను హెచ్చరిస్తున్న జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి

ఇల్లెందు రూరల్ : మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

లక్ష్మీదేవిపల్లి: శ్రీనగర్ గ్రామసభలో నిలదీస్తున్న ప్రజలు

దమ్మపేట: నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

టేకులపల్లి: అధికారులను నిలదీస్తున్న ప్రజలు

అన్నపురెడ్డిపల్లి: నిరసన తెలుపుతున్న మహిళలు

అశ్వారావుపేట: నిలదీస్తున్న మహిళలను సెల్‌లో వీడియో తీస్తున్న పోలీసులు

జూలూరుపాడు: అధికారులు ప్రశ్నిస్తున్న వారిని బయటకు నెట్టేస్తున్న పోలీసులు

బూర్గంపహాడ్ : ఇరవెండిలో కాంగ్రెస్ నాయకురాలిపై మండిపడుతున్న మహిళలు

అశ్వారావుపేట: ములకలపల్లి మండలం మాదారంలో రాస్తారోకో

పినపాక : దుగినేపల్లిలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

దుమ్ముగూడెం : కొత్తపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం

పాల్వంచ రూరల్: అనర్హుల జాబితా చూపిస్తున్న గ్రామస్తులు

చర్ల : అధికారులను ప్రశ్నిస్తున్న దరఖాస్తుదారుడు

పర్ణశాల : చిన్నబండ్రేవు గ్రామంలో దరఖాస్తులను అందజేస్తున్న ప్రజలు

కరకగూడెం: రఘునాథపాలెం పంచాయతీలో గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

గుండాల : పడుగోనిగూడెం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

అశ్వాపురం : అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడంతో గొడవచేస్తున్న ప్రజలు

బూర్గంపహాడ్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 22: విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణంపై అవగాహన పెంచుకోవడంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీఈడీ కళాశాలలో సబ్బులు, ఇతర ద్రవాల తయారీపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన అవసరమని, మారుతున్న వాతావరణానికి అనుగుణంగా విద్యార్థులు అర్థం చేసుకుని పర్యావరణానికి హాని కలగకుండా చూడాలన్నారు. నిత్యజీవితంలో ఉపయోగపడే వివిధ అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాల్లో చెత్త చెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్క్‌షాప్‌లో అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

అడవులను సంరక్షించాలి

అన్నపురెడ్డిపల్లి, జనవరి 22: అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని డీఎఫ్‌వో క్రిష్టాగౌడ్ ఆదేశించారు. అన్నపురెడ్డిపల్లి సెక్షన్ పరిధిలోని వెదురు ప్లాంటేషన్‌ను, పెంట్లం అటవీ ప్రాంతంలో మారు జాతి మొక్కల ప్లాంటేషన్‌ను, బేస్ క్యాంపును బుధవారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. ఎఫ్‌డీవో కోటేశ్వరరావు, ఎఫ్‌ఆర్‌వో యల్లయ్య, ఎఫ్ఎస్‌వో అమరేందర్ సింగ్, వీఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చండి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : విద్యుత్తు సంస్థల్లో 1999-2004 మధ్యకాలంలో నియామకమైన ఇంజినీర్లు, ఉద్యోగులను ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలని తెలంగాణ విద్యుత్తు ఇంజినీర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. పాల్వంచ కేటీపీఎస్, రామగుండంలో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్లాంట్లను జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని కోరింది. సంఘం డైరీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెహ్రూ, ప్రధాన కార్యదర్శి భాస్కర్, బాలరాజు, మోహన్‌రావు, శ్రీనివాస్, పాండ్యా, మధుకృష్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

జవాన్ల ఆధీనంలోకి మావోయిస్టుల శిక్షణ శిబిరం

అక్కడే ఉన్న పొలిట్‌బ్యూరో సభ్యుడి స్మారక స్తూపం గుర్తించి ధ్వంసం

మావోయిస్టులు అమర్చిన మందుపాతరను నిర్వీర్యం చేసిన భద్రతా దళాలు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 22: మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో మావోయిస్టుల షెల్టర్ జోన్లను భద్రతా దళాలు క్రమక్రమంగా తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులకు సంబంధించిన అత్యంత కీలకమైన శిక్షణ శిబిరాన్ని గుర్తించిన జవాన్లు దానిని స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు బీజాపూర్ జిల్లా పరిధిలోని బట్టిగూడ గ్రామ సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న శిక్షణ శిబిరాన్ని జవాన్లు గుర్తించారు. మావోయిస్టులు వేలాది మందిని రిక్రూట్ చేసుకుని ఇక్కడే శిక్షణ ఇచ్చినట్లు తెలుస్తున్నది. అదే ప్రాంతంలో మావోయిస్టుల పార్టీ పొలిట్‌బ్యూ సభ్యుడు కటకం సుదర్శన్ స్మారక స్తూపాన్ని గుర్తించి ధ్వంసం చేశారు. ఇలాంటి కీలకమైన శిక్షణ శిబిరాన్ని సైతం జవాన్లు స్వాధీనం చేసుకోవడం కొసమెరుపు. అయితే ఇప్పటికే దండకారణ్యంలో కొనసాగుతున్న మా'రణ'హోమంతో ఆ ప్రాంతాలు యుద్ధ భూమిని తలపిస్తున్నాయి. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సారథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కేంద్రంగా జరుగుతున్న 'కగార్'తో మావోయిస్టు పార్టీకి చిక్కులు వచ్చి పడుతున్నాయి. వేలాదిగా భద్రతా బలగాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టి యుద్ధం ప్రకటించడం.. పార్టీ అగ్రనేతలు నేలకొరుగుతున్న పరిణామాలు పార్టీకి కష్ట కాలంగా మారినట్లు తెలుస్తున్నది. సాయుధ బలగాలు తమకున్న ఆధునిక పరిజ్ఞానంతో అడవులను జల్లెడ పడుతూ దూకుడు మరింతగా పెంచుతున్నాయి. మారోవైపు మావోయిస్టులు సైతం ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు. ఏ క్షణాన ఎలాంటి విపత్తు సృష్టిస్తారో తెలియని పరిస్థితులు ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొన్నాయి. ఇదిలా ఉండగా.. బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్‌స్టేషన్ పరిధి ముత్వెండి-పీడియా వెళ్లే మార్గంలో జవాన్లను లక్ష్యంగా చేస్తూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరను భద్రతా దళాలు మంగళవారం సాయంత్రం గుర్తించాయి. ఆ మార్గంలో పలుచోట్ల మావోయిస్టులు అమర్చిన ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్(ఐఈడీ)లను గుర్తించి వాటిని జవాన్లు నిర్వీర్యం చేశారు.

రుణమాఫీపై చొరవ తీసుకోండి

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 22: మండలంలో అర్హతగల రైతులందరికీ రూ.2 లక్షల లోపు రుణ మాఫీ పూర్తి చేయాలని బ్యాంకు అధికారులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశించారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. ఆయన బుధవారం ములకలపల్లిలో పర్యటించారు. టీజీవీబీ, డీసీసీబీ అధికారులతో సమావేశమయ్యారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 22: పోలీస్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను ఎస్పీ బిరుదారాజు రోహిత్ రాజు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏఆర్ డీఎస్పీ కురసం సత్యనారాయణ, కార్యాలయ ఏవో మంజ్యానాయక్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, హోంగార్డ్స్ ఆర్ఐ నర్సింహారావు, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో తనిఖీ

ఇల్లెందు రూరల్, జనవరి 22: మండలంలోని రొంపేడు పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. యూపీహెచ్‌సీ భవన నిర్మాణానికి గోవింద్ సెంటర్‌లో స్థలం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత, డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 22: ఆటో నుంచి మద్యం బాటిళ్లను పోలీసులు బుధవారం స్వాధీనపర్చుకున్నారు. వారు తెలిపిన వివరాలు.. ములకలపల్లి మండలం మంగపేట వద్ద బుధవారం వాహనాలను ఎస్సై కిన్నెర రాజశేఖర్ తనిఖీ చేశారు. ఓ ఆటో నుంచి మద్యంతో వెళుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. గత ఏడాది డిసెంబర్ 21న రాజాపురం మద్యం దుకాణంలో బాటిళ్లను చోరీ చేసినట్లు వారు చెప్పారు. ఆటో, మద్యం బాటిళ్లను స్వాధీనపర్చుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

ఇద్దరికి 14 రోజుల రిమాండ్

మణుగూరు టౌన్, జనవరి 22: ఈ నెల 20వ తేదీన కూనవరం రైల్వే గేట్ సెంటర్‌లోని కూల్‌డ్రింక్ షాపులో విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ అధికారులు తనిఖీలు చేశారు. ఆ సమయంలో కొండగొర్రె మాంసం సుమారు 2 కేజీలు దొరికింది. పూర్తి విచారణ చేయగా బుగ్గ గ్రామంలో వజ్జ సారయ్య అనే వ్యక్తి అటవీ జంతువును చంపిన నేరంపై, బోశెట్టి కౌసల్యను అటవీ జంతువు మాంసం కొనుగోలు చేసిన నేరంపై అరెస్టు చేసి మణుగూరు కోర్టులో హాజరుపర్చారు. మణుగూరు మెజిస్ట్రేట్ వీరిద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించారు. రిమాండ్‌కు భద్రాచలం జైలుకు పంపారు.

శాలరీ అకౌంట్ ఉండాలి

ఇల్లెందు రూరల్, జనవరి 22: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఉద్యోగులందరికీ శాలరీ అకౌంట్ ఉండాలని ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన బుధవారం జీఎం కార్యాలయంలో ఎస్‌బీఐ అధికారులతో కలిసి ఉద్యోగులతో సమావేశమై శాలరీ అకౌంట్ ప్రయోజనాలను వివరించారు.

టీఎస్ టీటీఎఫ్ జిల్లా కమిటీ ఏకగ్రీవం

పాల్వంచ, జనవరి 22: తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (టీఎస్ టీటీఎఫ్) నూతన కమిటీని ఖమ్మం బంజారా భవన్‌లో బుధవారం జరిగిన సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షుడిగా భూక్యా మోహన్ రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా సపావత్ బాలకృష్ణ చౌహాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్యా బాబులాల్ నాయక్, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ శ్రీనివాస్ నాయక్, మీడియా కన్వీనర్‌గా ధరావత్ హనుమ నాయక్ ఎన్నికయ్యారు.రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

13 మందిపై అట్రాసిటీ కేసు

పాల్వంచ రూరల్, జనవరి 22: కులం పేరుతో దూషించిన 13 మందిపై రూరల్ పోలీసులు బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు.. మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఉల్వనూరు)కు చెందిన అసాదు ప్రవీణ్, ఈ నెల 19వ తేదీ రాత్రి తన స్నేహితులతో గ్రామ శివారులోని వంతెన వద్ద మాట్లాడుతున్నాడు. ఈ సమయంలో ఇక్కడ ఎందుకున్నారంటూ వారిని అదే గ్రామానికి చెందిన పానుగంటి లక్ష్మినారాయణ మందలించాడు. దీంతో ప్రవీణ్ స్నేహితులకు, లక్ష్మినారాయణకు మధ్య వాగ్వివాదం జరిగింది. కొద్దిసేపటి తర్వాత లక్ష్మినారాయణకు చెందిన కొందరు యువకులు వచ్చి, ప్రవీణ్‌తో పాటు అతని స్నేహితులను కులం పేరుతో దూషించి, కర్రలతో దాడి చేశారు. ప్రవీణ్‌తోపాటు అతని స్నేహితులైన నరేందర్, విజయ్, నిఖిల్ గాయపడ్డారు. ప్రవీణ్ ఫిర్యాదుతో పానుగంటి లక్ష్మినారాయణ, వేములపల్లి లోకేష్, పానుగంటి అన్వేష్, వేములపల్లి సుధాకర్‌తో పాటు మరో తొమ్మిదిమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ప్రమాదాల నివారణకు సహకరించండి

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 22: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్సై కొండపర్తి నరేష్ కోరారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా లారీ, ట్రాన్స్‌పోర్ట్ వాహనాల డ్రైవర్లకు కొత్తగూడెం-ఇల్లెందు బైపాస్ రోడ్డులో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సోచ్ ఆర్గనైజేషన్‌కు విరాళం

మణుగూరు టౌన్, జనవరి 22: మణుగూరులోని ఎక్స్‌లెంట్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సోచ్ ఆర్గనైజేషన్‌కు రూ.31 వేల నగదును విరాళంగా అందజేశారు. ప్రిన్సిపాల్ మహ్మద్ ఖాదర్, డైరెక్టర్ యూసుఫ్, చైర్మన్ యాకూబ్ షరీఫ్ ముఖ్య అతిథులుగా పాల్గొని వీటిని అందించారు.

కొనసాగుతున్న ఆర్టీజన్ల దీక్ష

పాల్వంచ, జనవరి 22: రాష్ట్రంలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలో పనిచేస్తున్న 20వేల మంది ఆర్టీజన్లను విద్యార్హతలనుబట్టి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ వారు చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం మూడో రోజు కూడా కొనసాగింది. శిబిరానికి బండి నాగేశ్వరరావు మద్దతు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

బూర్గంపహాడ్, జనవరి 22: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని భద్రాచలం ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్‌లో ఎంఈవో యదుసింహరాజు పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు, వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఇల్లెందులో మంత్రి పొంగులేటి పర్యటన

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఇల్లెందు, జనవరి 22: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఇల్లెందు పట్టణంలో పర్యటించారు. రోడ్డుకు శంకుస్థాపన చేశారు. డిజిటల్ సెంట్రల్ లైబ్రరీని ప్రారంభించారు. బుగ్గవాగు సుందరీకరణ, 22వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మున్సిపల్ గెస్ట్‌హౌజ్‌కు శంకుస్థాపన చేశారు. పాకాల రోడ్డులో సెంట్రల్ లైటింగ్ ప్రారంభించారు. 23వ వార్డులో పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర రావు, వైస్ చైర్మన్ జానీపాష, ఎస్సీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నోరూరించేలా వంటకాలు ఉండాలి

మాట్లాడుతున్న కలెక్టర్

ఇల్లెందు రూరల్, జనవరి 22: పర్యాటకులను ఆకట్టుకునేలా, నోరూరించేలా వంటకాలు తయారు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. మండలంలోని పూబెల్లి పంచాయతీని బుధవారం సందర్శించి, గ్రామస్తులతో మాట్లాడారు. కావాల్సిన సౌకర్యాలు, వసతులు, సదుపాయాలపై చర్చించారు. పూబెల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. సూచిక బోర్డులు, సోలార్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జొన్నరొట్టెలు, ఆకుకూరలు, నాటుకోడి మాంసాహారం, శాఖాహారాలలో వివిధ రుచుల వంటకాలు అందిస్తే పర్యాటకుల తాకిడి పెరుగుతుందని సూచించారు.

అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

లక్ష్మీదేవిపల్లి, జనవరి 22: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. అనిశెట్టిపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గ్రామసభలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అర్హుల జాబితాలో పేరు రాని వారు ప్రత్యేక కౌంటర్లలో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

తొలగించారు.. మళ్లీ పెట్టారు

రాళ్ళ కుప్పలపై పడేసిన శిలాఫలకం

అశ్వారావుపేట, జనవరి 22: బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి అనావాళ్ళను చెరిపేసేందుకు కొందరు కుట్ర చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొత్తగా ఏర్పడిన 49 పంచాయితీలకు కేసీఆర్ ప్రభుత్వం 2023లో సొంత భవనాలను మంజూరు చేసింది. వీటిలో అశ్వారావుపేట మండలం వేదాంతపురం పంచాయితీ భవనం కూడా ఉంది. దీనికి అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు 2023 జూన్ 17న శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం కొనసాగుతుండగానే సాధారణ ఎన్నికలు వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణం పూర్తయింది. దీనిని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రారంభించారు. అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శంకుస్థాపన చేసిన శిలాఫలకం ధ్వంసమైన స్థితిలో రాళ్ల కుప్పపై పడి ఉంది. దీనిని బీఆర్ఎస్ నాయకులు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మందపాటి రాజమోహన్‌రెడ్డి, జె.వెంకన్నబాబు, సత్యవరపు సంపూర్ణ గమనించి.. ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మెచ్చా కూడా ఐటీడీఏ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో బుధవారం వైరల్ కావడంతో ఐటీడీఏ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే జారే ప్రారంభించిన శిలాఫలకం సమీపంలోనే, మెచ్చా శంకుస్థాపన చేసిన శిలాఫలకాన్ని తిరిగి పెట్టించారు. దీనిపై ఐటీడీఏ ఏఈ ప్రసాద్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరింది. 'శంకుస్థాపన శిలాఫలకం అడ్డుగా ఉండటంతో భవనంలో ఏర్పాటు చేసేందుకు తొలగించి భద్రపరిచాం. భవనం లోపల భద్రపరిచిన ఆ శిలాఫలకం బయటకు ఎలా వచ్చిందో తెలుసుకుంటున్నాం' అని చెప్పారు.